

శిథిల ఆలయాలు



రుద్రవరం మండలం శ్రీరంగాపురంలో పురాతన శ్రీరామాంజనేయ దేవాలయం

- 400 ఏళ్ల క్రితం నిర్మాణాలు
- దెబ్బతిన్న ధ్వజస్తంభాలు
- మాన్యం భూములున్నా అభివృద్ధి శూన్యం
- పట్టించుకోని దేవాదాయశాఖ అధికారులు

ఆ గ్రామంలో ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా ఆరు ఆలయాలు ఉన్నాయి. అవన్నీ ఒకే చోట.. దగ్గర దగ్గరగా ఉన్నాయి. వీటిని 400 ఏళ్ల క్రితం నిర్మించారు. దేవాలయాల ముందు ఉన్న ధ్వజస్తంభాలు చెదలు పట్టి దెబ్బతిన్నాయి . మాన్యం భూములున్నా దేవాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏడాది దేవదాయ శాఖాధికారులు గ్రామానికి రావడం, వేలం నిర్వహించడం జరుగుతుందే తప్ప దేవాలయ అభివృద్ధి పట్టించుకోవడం లేదు.

రుద్రవరం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో 400ఏళ్ల క్రితం దేవాలయాలు నిర్మించారు. ప్రస్తుతం అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ధ్వజస్తంభాలు దెబ్బతిన్నాయి. దేవదాయశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. మాన్యం భూములున్నా అభివృద్ధికి నోచుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈశ్వర, రామ, అంజనేయ ఒక్క పక్క, మరో పక్క రామ, ఆంజనేయ, ఈశ్వరమ్మ దేవాలయాలున్నాయి. ఒకే ప్రాంతంలో రెండు రెండు దేవాలయాలున్నాయి. రామాలయాలు రెండు, ఆంజనేయస్వామి ఆలయాలు రెండుతో పాటు ఈశ్వర, ఈశ్వరమ్మ దేవాలయాలు ఇక్కడ ఉన్నాయి.



శిథిలమైన చెక్క ధ్వజ స్తంభాలు

చెదలు పట్టి..

దేవాలయాల ముందు ఉన్న ధ్వజస్తంభాలు చెదలు పట్టి దెబ్బతిన్నాయి. ఏకంగా ఒక దేవాలయం ముందు ఉన్న ధ్వజస్తంభం కింద పడిపోతే మరో ధ్వజస్తంభం వద్ద అక్కడే నిల్వ ఉంచారు. ఇంకో దేవాలయం ముందు ఉన్న ధ్వజస్తంభం తుప్పుబట్టి దెబ్బతింది. అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

అభివృద్ధికి నోచుకోవడం లేదని..

మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో ఈశ్వర, శ్రీరామ, ఆంజనేయ, ఈశ్వరమ్మ దేవాలయాలకు మాన్యం భూములున్నాయి. సర్వే నెం.300లో 4.02 ఎకరాలు, సర్వే నెం.301లో 1.50, 302లో 2 ఎకరాలు, 154 సర్వేనెంబరులో 4.71, 340లో 3.98 ఎకరాలు, 529/1లో 0.89 , 529/2లో 2.89 ఎకరాలు మాన్యం భూములున్నాయి. దేవాలయాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.



శ్రీరంగాపురంలో ఆలయ భూములకు కౌలు వేలం నిర్వహిస్తున్న దేవదాయశాఖ అధికారులు (ఫైల్)

వేలం నిర్వహించడమే తప్ప..

దేవదాయ శాఖాధికారులు పట్టించుకోవడం లేదని ప్రజల్లో విమర్శలున్నాయి. జూలై 21న కౌలు భూములకు వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.3.42లక్షలు ఆదాయం వచ్చింది. ప్రతి ఏడాది దేవదాయ శాఖాధికారులు గ్రామానికి రావడం, వేలం నిర్వహించడం జరుగుతుందే తప్ప దేవాలయాల అభివృద్ధిని పట్టించుకోవడం లేదు.

18 ఏళ్ల నుంచి పూజలు చేస్తున్నా



శ్రీరంగాపురం గ్రామంలోని దేవాలయాల్లో 18 ఏళ్ల నుంచి పూజలు చేస్తున్నా. నేటికీ నేనే పూజలు చేస్తూ వస్తున్నా. దేవదాయ శాఖాధికారుల ఆదేశాల మేరకు ఆలయాల్లో పూజలు చేయడం నా విధి.

● సత్యనారాయణశర్మ, పూజారి

నివేదికలు సిద్ధం చేస్తున్నా



శ్రీరంగాపురం గ్రామంలోని దేవాలయాల అభివృద్ధికి నివేదికలు సిద్ధం చేస్తున్నాం. జూలై నెల 21న దేవాలయ భూములకు కౌలు వేలం నిర్వహించా. వచ్చిన సొమ్మును దేవాలయ ఖాతాలో జమచేస్తాం.

● రామాంజనేయశర్మ, ఈవో, దేవదాయశాఖ

వచ్చేనెల 12న ఆర్‌యూ 4వ స్నాతకోత్సవం

- హాజరు కానున్న గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

కర్నూలు అర్బన్ , అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ)లో 4వ స్నాతకోత్సవం నవంబర్ 12న నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ బోయ విజయకుమార్ నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ హాజరు అవుతారని ఆయన పేర్కొన్నారు. 2021-22, 2022-23, 2023-24, 2024-25 విద్యా సంవత్సరాల్లో యూజీ, పీజీ, బీఈడీ. బీపీఈడీ, ఎల్ఎల్‌బీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు పూర్తి చేసుకొని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు పట్టాలు పొందొచ్చని ఆయన సూచించారు. ఇప్పటికే రెండు సార్లు స్నాతకోత్సవానికి నోటిఫికేషన్ విడుదల చేయడంతో విద్యార్థులు దరఖాస్తులు చేసుకున్నారని వెల్లడించారు. యూజీ 9,404, పీజీ, ఇతర ప్రొఫెషనల్ కోర్సుల్లో 420, పీహెచ్‌డీ 148 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని, 70 మందికి గోల్డ్ మెడల్స్ ప్రదానం చేస్తారని వివరించారు.

నకిలీ మద్యంపై నిఘా పెట్టండి

- అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి



సీఐలతో సమీక్షిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి

కర్నూలు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యంపై అధికారులు ప్రత్యేక నిఘా పెట్టాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి ఆదేశించారు. బుధవారం తన కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ వి. హనుమంతరావుతో కలిసి ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల సీఐలతో నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాట్లాడు తూ అన్నమయ్య జిల్లా మొలకలచెరువు నకిలీ మద్యం నేపథ్యంలో జిల్లాలో ముమ్మర తనిఖీలు చేయాలని అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పాత కేసుల్లో నిందితులను బైండోవర్లు చేసి, వారి ప్రస్తుత కార్యకలాపాలపై దృష్టి పెట్టాలన్నారు. పొరుగు రాష్ట్రాల మద్యం జిల్లాలోకి ప్రవేశించ కుండా నిరంతరం దాడులు కొనసా గించాలని ఆదేశించారు. సారా తయారీని మానేసిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూపించాలన్నారు. ఈ సమీక్షలో సూపరింటెండెంట్లు మచ్చా సుధీర్ బాబు, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు డి. రామకృష్ణారెడ్డి, రాజశేఖరగౌడ్ పాల్గొన్నారు.

యాపదిన్నెలో హైకోర్టు న్యాయమూర్తి



హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డిని కలిసిన న్యాయవాదులు

డోన్ రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): డోన్ మండలంలోని స్వగ్రామమైన యాపదిన్నెకు హైకోర్టు జడ్జి జస్టిస్ శ్రీనివాసరెడ్డి బుధవారం వచ్చారు. ఆయనను డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ నాయుడు, న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమాల, శాలువాతో సన్మానించారు.

కొలిమిగుండ్లలో 14.6 మి.మీ. వర్షపాతం

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : అల్పపీడనం ప్రభావంతో జిల్లాలోని కొలిమిగుండ్లలో బుధవారం అత్యధికంగా 14.6 మి.మీ. వర్షపాతం నమోదయింది. వర్షం కురవడంతో రోడ్లు జలమయమయ్యాయి. పొలాల్లో నీరు నిలవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బండిఆత్మకూరులో 6.6 మి.మీ., శ్రీశైలంలో 1.4 మి.మీ. వర్షపాతం నమోదయింది.

వ్యాధుల నియంత్రణపై అవగాహన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ ఆధ్వర్యంలో కీటకజనిత వ్యాధుల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా, మెదడువాపు, బోదకాలు వంటి వ్యాధులు దోమకాటు వల్ల వస్తాయని గ్రామ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు దోమకాటుకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమకాటుతో కలిగే ప్రాణహాని గురించి ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శారదాబాయి, మెడికల్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.నిరంజన్, జిల్లా మలేరియా అధికారి సి.చంద్రశేఖర్, సహాయ అధికారి కె.సత్యనారాయణ, సిబ్బంది జిల్లాలోని సబ్ యూనిట్ అధికారులు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రెడ్ క్రాస్ నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న డీఆర్వో రామునాయక్

నంద్యాల నూనెపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్, కలెక్టర్ జి.రాజకుమారి ఆదేశాల మేరకు బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు రెడ్ క్రాస్ కమిటీ ఇన్‌చార్జ్ చైర్మన్, డీఆర్వో రామునాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్ క్రాస్ కార్యకలాపాలను బలోపేతం చేయడం, సమాజ సేవలను విస్తరించడమే లక్ష్యంగా నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాత కమిటీలోని కొంతమంది సభ్యులతో పాటు పట్టణంలోని ప్రముఖ వైద్యులను, విద్యాసంస్థల ప్రతినిధులను ఎన్నుకున్నట్లు వివరించారు. అలాగే కొంతమంది పట్టణ ప్రముఖులను ఎక్స్- ఆఫీషియో సభ్యులుగా చేర్చనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల్లో రెండోసారి చైర్మన్‌గా దస్తగిరి పర్ల, వైస్ చైర్మన్‌గా డా. మమతారెడ్డి, కోశాధికారిగా నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన మేనేజ్‌మెంట్ కమిటీలో డా.ఆరిఫా భాను, డా.నిషితారెడ్డి, డా.నెరవాటి అరుణకుమారి, ఉస్మాన్ బాషా, పేరుసోముల నరసింహమూర్తి, తెలకపల్లి రాధాకృష్ణయ్య, శ్రీశైలం నాగశేషయ్య, యాకూబ్ తదితరులు సభ్యులుగా ఎన్నికయ్యారు. చైర్మన్ దస్తగిరి మాట్లాడుతూ.. కలెక్టర్ మార్గదర్శకత్వంలో నంద్యాల జిల్లాలో రెడ్‌క్రాస్ సేవలను మరింత విస్తరిస్తామన్నారు. ప్రతి కళాశాల, పాఠశాలల్లో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ యూనిట్లను ఏర్పాటు చేసి, విపత్కర పరిస్థితుల్లో సహాయక సైన్యంగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. ఈ ఎన్నికల ప్రక్రియకు రాష్ట్ర కమిటీ తరఫున కోశాధికారి రామచంద్రరాజు అబ్జర్వర్‌గా హాజరు కాగా కర్నూలు జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డా.కేజీ గోవిందరెడ్డి, రెడ్ క్రాస్ ప్రస్తుత జిల్లా సెక్రటరీ, కలెక్టరేట్ ఏఓ శుభకర్, జిల్లా కోఆపరేటివ్ డివిజన్ అధికారి జానకిరాముడు, సబ్ రిజిస్ట్రార్ వెంకట సుబ్బయ్య తదితరులు హాజరయ్యారు.

శ్రీశైలం డ్యాం గేట్లు మూసివేత

శ్రీశైలం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. బుధవారం జలాశయం ఇంజనీర్లు డ్యాం గేట్లను మూసివేశారు. గరిష్ఠస్థాయి నిల్వలతో నిలకడగా ఉంచారు. డ్యాం పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా నీటినిల్వ సామర్థ్యం 215 టీఎంసీలుగా ఉంది. ఎగువ పరివాహక ప్రాంతాలైన జూరాల స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి, సుంకేసుల, హంద్రీ నుంచి 87,064 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వచ్చిచేరాయి. శ్రీశైలం రెండు విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం 66,148 క్యూసెక్కులు విడుదల చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి 884 అడుగులుగా, నీటినిల్వ సామర్థ్యం 212 టీఎంసీలుగా ఉంది.



మూసివేసిన గేట్లు

రోడ్లకు మహర్దశ
విలువలతో కూడిన విద్య అవసరం 6

కుంగిన రివిట్‌మెంట్‌ను సరిచేస్తాం : సీఈ

- అవుకు రిజర్వాయర్‌లో రూ. 57 లక్షలతో త్వరలో పనులు ప్రారంభం



రిజర్వాయర్ వద్ద అధికారులతో మాట్లాడుతున్న సీఈ కబీర్‌బాషా

అవుకు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయర్‌లో అంతర్భాగమైన తిమ్మరాజు చెరువు లోపల కుంగిన ఎర్రరాతి రివిట్‌మెంట్‌ను సరిచేసి లీకేజీని అరికడతామని జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ కబీర్ బాషా అన్నారు. బుధవారం ఎస్సార్బీసీ ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి, ఈఈ శుభకుమార్‌తో కలిసి రిజర్వాయర్ వద్దకు చేరుకుని కుంగిన రివిట్‌మెంట్‌ను, మట్టికట్టల నుంచి నీరు లీకవుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ తిమ్మరాజు చెరువుకు గతంలో ఉన్న పాత తూము వద్ద నిర్మాణ లోపం జరిగినట్లు గుర్తించామన్నారు. గత ఏడాది రివిట్‌మెంట్ కుంగటంతో మరమ్మతుల కోసం మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి చొరవతో డీఎంఎఫ్ నిధుల నుంచి రూ.కోటి మంజూరు చేశారన్నారు. మరమ్మతు పనుల కోసం కర్ణాటక రాష్ట్రానికి చెందిన అక్షిత్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ రూ.57 లక్షలకు కాంట్రాక్ట్ దక్కించుకుందన్నారు. అగ్రిమెంట్ ప్రకారం ఈనెల 12వ తేదీ తరువాత కుంగిన రివిట్‌మెంట్‌ను కాంట్రాక్టరు సిబ్బందితో కలిసి పరిశీలిస్తారన్నారు. ప్లగ్గింగ్ వర్క్ (నీటిలో కాంక్రీట్ వేసి లీకేజీ నియంత్రణ) విధానంతో కుంగిన రివిట్‌మెంట్ ద్వారా మట్టికట్టల నుంచి బయటకు వస్తున్న నీటిని అరికడతారన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 2.5 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. రిజర్వాయర్‌కు ఎలాంటి ముప్పు లేదని, ప్రజలు ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు. అవుకు రిజర్వాయర్ నుంచి చెర్లోపల్లె సమీపంలోని జీఎన్ఎస్ఎస్ హెడ్‌రెగ్యులేటర్ ద్వారా ప్రతి ఏటా కడప జిల్లా వాసుల తాగు, సాగు నీటి అవసరాల కోసం 70 నుంచి 100 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన రిజర్వాయర్ మరమ్మతులకు గురి కాకుండా ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. పనులు పూర్తయిన వెంటనే రిజర్వాయర్‌ను పూర్తి స్థాయిలో నింపి వచ్చే సీజన్‌కల్లా ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగు నీరు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్బీసీ డీఈలు మల్లికార్జున, సాయికిరణ్, సుబ్బారావు, జేఈ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు



సభా ప్రాంగణంలో కొనసాగుతున్న పనులు

- 16న కర్నూలుకు ప్రధాన మంత్రి రాక
- 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' సభలో పాల్గొననున్న మోదీ
- రాగమయూరి వెంచర్‌లో సభా ఏర్పాట్లు
- సీఎం చంద్రబాబు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష
- సమన్వయంతో దిగ్విజయం చేయాలని రెండు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలకు సూచనలు
- భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డి

కర్నూలు/కర్నూలు క్రైం/ఓర్వకల్లు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 16న కర్నూలు, శ్రీశైలంలో పర్యటించనున్నారు. సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' పేరిట జరిగే జీఎస్టీ-2.0 సంస్కరణలు, ప్రయోజనాలపై ప్రజల అవగాహన సభలో పాల్గొననున్నారు. సీఎం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ హాజరయ్యే ఈ సభను దిగ్విజయం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రధాని మోదీ మూడో పర్యాయం బాధ్యతలు చేపట్టాక ఏపీలో మూడో పర్యటన ఇది. రాయలసీమ ముఖద్వారం కర్నూలులో తొలి జీఎస్టీ 2.0 అవగాహన సభ కావడం, ప్రధాని మోదీ వస్తుండడంతో జిల్లా యంత్రాంగానికి ఎంతో ప్రతిష్టాత్మకంగా మారింది. ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. సభను సక్సెస్ చేయడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. భద్రతా ఏర్పాట్లపై అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డి, రాయలసీమ పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ క్షేత్రస్థాయిలో, రోడ్లు భవ నాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. బుధవారం ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లలో మంత్రులు, అధికారులు నిమగ్నమయ్యారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

ఎవరి పనుల్లో వారు బిజీ

ప్రధాని మోదీ పర్యటనను విజయవంతం చేయడంలో కలెక్టర్ నుంచి సామాన్య కార్యకర్త వరకు ఎవరికి వారే బిజీగా ఉన్నారు. నన్నూరు టోల్ ప్లాజా దగ్గర రాగమయూరి వెంచర్‌లో సభా ప్రాంగణం, హెలిప్యాడ్, ఉమ్మడి కర్నూలు, నంద్యాల సహా రాయలసీమ జిల్లాల నుంచి తరలివచ్చే ప్రజల వాహనాలు, వీవీఐపీలు, వీఐపీల వాహనాల నిలిపేందుకు 12 పార్కింగ్ స్థలాలు అభివృద్ధి చేస్తున్నారు. జాతీయ రహదారి నుంచి సభా ప్రాంగణం వరకు ప్రధాన రహదారి, డైవర్షన్ రోడ్లను బీటీ రోడ్లుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి.

మిగతా 6వ పేజీలో

గంగమ్మ పైపైకి..

నెలరోజులుగా కురుస్తున్న వర్షాలు.. ఎల్లెల్సీకి నీటి విడుదలతో డివిజన్‌లో భూగర్భజలాలు పెరిగాయి. ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో గత వేసవిలో దాదాపు వెయ్యి బావులు, మూడు వేల బోర్లు అడుగంటి పోయాయి. ప్రస్తుతం కురిసిన వర్షాలతో గతంలో ఎండిన బావులు, బోర్లు నీటితో కళకళలాడుతున్నాయి. గంగమ్మ తల్లికి పైపైకి ఉబికి వస్తోంది. ఖరీఫ్‌లో సుమారు 20వేల ఎకరాల్లో పలు పంటలు సాగుచేశారు. పుష్కలంగా నీటిని చూసి రైతన్న ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.



- బావులు.. బోర్లలో పొంగి పొర్లుతున్న నీరు
- పెరుగుతున్న భూగర్భజలాలు
- రబీ సాగుకు ఇబ్బంది లేనట్టే

గోనెగండ్ల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేని వర్షాలతో గంగమ్మ పైపైకి ఉబికి వస్తోంది. బావులు, బోర్లలో భూగ ర్భజలాలు వృద్ధి చెందాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తు న్నారు. గత ఏడాది వర్షాలు సకాలంలో కురియక పోవడంతో భూ గర్భజలాలు అడుగంటి పోయాయి. నెల రోజులుగా వర్షాలు కురు స్తున్నాయి. గతంలో ఎండిన బావుల్లో సైతం నీట ఊరుతుంది. ప్రస్తుతం ఎమ్మిగనూరు డివిజన్‌లో బావులు, బోర్ల కింద పత్తి, వేరుశనగ, ఉల్లి, కంది పంటలను 20వేల ఎకరాల్లో సాగుచేశారు. ఈ ఏడాది ముందస్తుగా అరకొర వర్షాలు కురియడంతో పంటలు సాగు చేశారు.



బోరు కింద సాగు చేసిన ఉల్లి పంట

దాదాపు వెయ్యి బావులు..

ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో గత వేసవిలో దాదాపు వెయ్యి బావులు, మూడు వేల బోర్లు అడుగంటి పోయాయి. ప్రస్తుతం కురిసిన వర్షాల తో గతంలో ఎండిన బావులు బోర్లు నీటితో కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది గోనెగండ్ల మండలం హెచ్ కైరవాడి, వేముగోడు, చిన్ననేలటూరు, పెద్దమరివీడు, కులుమాల, అలువాల, గాజులదిన్నె, తిప్పనూరు, నందవరం మండలంలో ముగతి, నాగలదిన్నె, మిట్టసోమాపురం, గురుజాల, పూలచింత, ధర్మాపురం, హలహర్వి గ్రామాల రైతులు బావులు బోర్లు కింద పంటలు సాగు చేశారు.

బావులు, బోర్ల కిందే అధిక సాగు

ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల మండలాల్లో బావులు, బోర్ల కింద అధికంగా సాగు చేస్తారు. ఈ ఏడాది బావులు, బోర్లలో మొదట్లో నీరు అంతంతా మాత్రమే ఉండేది. ఇటీవల కురిసిన వర్షాలతో బావులు, బోర్లలో నీరు ఆశా జనకంగా ఊరుతుంది. రైతులు తమ పంటలకు నీటిని మళ్లించుకొని పంటలను పండించుకుంటున్నారు. వచ్చే వేసవిలో కూడా పంటలకు సాగునీటి ఇబ్బంది ఉండదని రైతులు చెబుతున్నారు.

ఎండిన బోరుకు నీరు వస్తుంది



వేసవిలో ఎండిన బోరుకు సైతం ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు, ఎల్లెల్సీ కాలువకు నీరు విడుదల కావడంతో నీరు అందుతుంది. ఆటీటితో మూడు ఎకరాల్లో వత్తిని సాగుచేశా. ప్రస్తుతం నీటి ఇబ్బంది లేదు. ● రాముడు, రైతు, గంజహళ్లి

నీరు పుష్కలంగా ఊరుతుంది



గత నెల నుంచి కురుస్తున్న వర్షాలతో భూమిలో నీటి శాతం పెరిగింది. దీంతో ప్రస్తుతం బావులు, బోర్లకు నీరు బాగా ఊరుతుంది. తన బోరుకు కూడా నీరు పుష్కలంగా అందుతుంది. ● రాయుడు, రైతు, గోనెగండ్ల

హంద్రీకి జలకళ

భారీవర్షాలతో హంద్రీ నదికి జలకళ సంతరించుకుంది. హంద్రీ పరిసర గ్రా మాలైన గాజులదిన్నె, హెచ్ కైరవాడి, వేముగోడు, పిల్లిగుండ్ల, తిప్పనూరు, బోడేపాడు, వీరంపల్లి, పుట్టపాశం, గ్రామాల రైతులు హంద్రీ నీటితో పంటలు పండించుకుంటున్నారు. దాదాపు 1000 ఎకరాల పైగానే హంద్రీ నీటితో పంటలు సాగు చేసుకుంటున్నారు. తాగునీటి సమస్య కూడా తీరింది.



హంద్రీనదిలోని నీటికోసం చేసిన బోరు

ప్రధాని పర్యటనకు వైద్య బృందాలు సిద్ధంగా ఉండాలి

- ఈ నెల 16 వరకు సెలవులు రద్దు
- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 16న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటన దృష్ట్యా మెడికల్ టీమ్‌లు సిద్ధంగా ఉండాలని సంబంధిత హెచ్‌ఓడీలను కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం సర్వజన వైద్యశాల ధన్వంతరి కాన్ఫరెన్స్ హాలులో అన్ని విభాగాల హెచ్‌ఓడీలతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ వరకు అన్ని విభాగాల సంబంధించిన వైద్యులు ఆసుపత్రి సిబ్బంది సెలవులు రద్దు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ తెలిపారు. అన్ని విభాగాల వైద్యులు సమయపాలన, పాటించి నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. క్యాజువాల్టీకి వచ్చే అత్యవసర కేసులు త్వరితగతిన వైద్యసేవలు అందించాలని హెచ్‌ఓడీలను ఆదేశించారు.



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

ఎమర్జెన్సీ డిపార్టుమెంటుకు వచ్చే రోగులను త్వరగా అడ్మిషన్ అయ్యే విధంగా చూసుకుని సంబంధిత విభాగాలకు షిఫ్ట్ అయ్యేలా చూసుకోవాలన్నారు. ఆసుపత్రి భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నామని, శానిటేషన్ సిబ్బంది అన్ని విభాగాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమీక్షలో ఇన్‌చార్జి సీఎస్‌ఆర్ఎంఓ డా.వెంకటరమణ, వైస్ ప్రిన్సిపాల్ డా.హరిచరణ్, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, హెచ్‌ఓడీలు డా.శ్రీనివాసులు, డా.పి.శ్రీనివాసులు, హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

- నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

డోన్ టౌన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన విద్య అవసరమని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాయని నంద్యాల పార్లమెంటు సభ్యురాలు, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో నూతన కేంద్రీయ విద్యాలయ తరగతులను ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా శబరి మాట్లాడుతూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యపట్ల ప్రత్యేక దృష్టి సారించారన్నారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా విద్యకు అధిక నిధులు రాబట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లా కేంద్రం



కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాలలో కూడా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల అధికంగా ఉండటంతో మరో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు చేయాలని తాను కేంద్ర ప్రభుత్వాన్ని కోరగా మంజూరుకు అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, హిందీ చదవడం, రాయడం, నేర్చుకున్న విద్యార్థులు దేశంలో ఎక్కడైనా రాణించగలరని ఆమె అన్నారు. కేంద్రీయ విద్యాలయంలో చదువుకునే విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని, ఏ అవసరం వచ్చినా తనకు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డోన్ ఆర్డీవో కేవీ నరసింహులు, ఆర్యన్ సీఎ ఇర్ఫాన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లకు మహర్దశ

- నంద్యాల జిల్లాకు రూ.73.10 కోట్లు మంజూరు
- మరమ్మతులు, నిర్మాణాలకు నిధులు
- పనుల కోసం త్వరలోనే టెండర్లు



నంద్యాల హాస్పిటల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రోడ్లకు మహర్దశ పట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం స్టేట్ హైవేలు, మేజర్ డిస్ట్రిక్ట్ రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు మంజూరుచేసిన నిధుల్లో జిల్లాలో 23పనులకుగాను రూ.73.10కోట్లు కేటాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా స్టేట్ హైవేలు 108పనులకుగాను రూ.400కోట్లు ఎండీఆర్ కింద 166పనులకు గాను రూ.600కోట్లు మంజూరు చేసింది. ఈమేరకు స్పెషల్ చీఫ్ సెక్రెటరీ కృష్ణబాబు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.

మంజూరైన నిధులు..

బనగానపల్లె నియోజకవర్గంలో పాపిలి, యాగంటి, బనగానపల్లె రోడ్డుకు రూ.3.20కోట్లు, కోవెలకుంట్ల-బనగాన పల్లె రోడ్డుకు రూ.1.50కోట్లు, కల్వటేకంబర్ల-బనగానపల్లె రోడ్డుకు రూ.1.60కోట్లు, కాల్వ, బేతంచెర్ల, బనగానపల్లె రోడ్డుకు రూ.7.50కోట్లు మంజూరయ్యాయి. కోవెలకుంట్ల-బనగానపల్లె రోడ్డుకు రూ.6కోట్లు, పాపిలి, యాగంటి, బనగానపల్లె రోడ్డుకు రూ.5కోట్లు, పాణ్యం-బనగానపల్లె రోడ్డుకు రూ.50లక్షలు, కాల్వ, బేతంచెర్ల, బనగానపల్లెరోడ్డుకు రూ.1కోటి మంజూరు చేసింది.

- నంద్యాల-ఆత్మకూరు రోడ్డుకు రూ.2.50కోట్లు, నంద్యాల-మహానంది రోడ్డుకి రూ.2కోట్లు, గిద్దలూరు-సుంకేసుల రోడ్డు, ఆవుకు-తాడిపత్రి రోడ్డు, సింగనపల్లె, బెలూం వయా చనుగొండ్ల రోడ్డు 6.20కిలోమీటర్లకు రూ.3.70కోట్లు.
- నంద్యాల-పులిమద్ది రోడ్డు 9.90కి.మీకి గాను రూ.4.35కోట్లు, ఆవుకు-తాడిపత్రి రోడ్డు 5.00కి.మీకి గాను రూ.2.50కోట్లు, ఆవుకు-తాడిపత్రి రోడ్డు 8.00కి.మీకి గాను రూ.4కోట్లు, ఆవుకు-తాడిపత్రి రోడ్డు 2.20కి.మీకి రూ.1.90కోట్లు.
- నందవరం-టంగుటూరు, వీపీజీరోడ్డు టు కేజీ రోడ్డు వయా మిట్టపల్లె 3.50కి.మీ రూ.3కోట్లు, కేజే రోడ్డు-బీఆర్‌పీ రోడ్డు వయా గుళ్లదుర్తికి గాను రూ.3.50కోట్లు, కేజే రోడ్డు టు పాల్లెపాడుకి రూ.2కోట్లు, పేరుసోముల, పెద్దవెంతుర్ల, ఇటిక్యాల, ఉమ్మాయిపల్లె రోడ్డుకిగాను రూ.2.30కోట్లు.
- శిరివెళ్ల నుంచి రుద్రవరం రోడ్డు 2.20కి.మీకి రూ.1.75కోట్లు, శిరివెళ్లమెట్ట నుంచి గోస్పాడు రోడ్డు 10.00కి.మీకి రూ.5.80కోట్లు, వెలుగోడు, గార్లదిన్నె 2.50కి.మీకిగాను రూ.4.50కోట్లు, బైపాస్ రోడ్డు టు చర్లవరం గ్రామానికి 1.60కి.మీకిగాను రూ.3కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు త్వరలో టెండర్లు ఆహ్వానించనున్నారు.

కర్నూలు జిల్లాకు రూ.37.10 కోట్లు మంజూరు

కర్నూలు అర్బన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రాష్ట్ర, జిల్లా రహదారులకు రూ.37.10 కోట్లు మంజూరు చేస్తూ ఆర్ అండ్ బీ ప్రిన్సిపల్ సెక్రటరీ టి. కృష్ణబాబు జీవో జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలో రాష్ట్ర రహదార్ల (ఎస్‌హెచ్)కు రూ.18 కోట్లు, జిల్లా ప్రధాన రహదార్ల (ఎండీఆర్)కు రూ.19.10 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర రహదారుల్లోని కర్నూలు - బళ్లారి రోడ్డు 27 కి.మీకు రూ. 8 కోట్లు, సి. బెళగల్, గూడూరు మీదుగా ఎమ్మిగనూరు రోడ్డుకు 7 కి.మీలకు రూ. 5 కోట్లు, గుత్తి, పత్తికొండ, ఆదోని రోడ్డుకు 9 కి.మీలకు రూ. 5 కోట్లు కేటాయించారు. అలాగే జిల్లా ప్రధాన రహదారులైన మదిర- కాత్రికి 3.0 కి.మీ, నదిచాగి- బాపురం రోడ్డు 2 కి.మీ, మా దవరం - ఎం తాండ 6 కి.మీ రోడ్డుకు రూ. 3.60 కోట్లు, కొడిమాల నుంచి ఆలూరు రోడ్డు 12.30 కి.మీ రూ.3.5 కోట్లు, ఎమ్మిగనూరు నుంచి మాలపల్లె మీదుగా కోసిగి వరకు 11 కి.మీ రూ.5 కోట్లు, ధనాపురం - హొళగుంద వరకు 12.80 కి.మీకు రూ.7 కోట్లు కేటాయించారు.

ప్రహ్లాద వరదుడికి ప్రత్యేక పూజలు

రెండో రోజు వైభవంగా పవిత్రోత్సవం

ఆళ్లగడ్డ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దిగువ అహోబిలంలో ప్రహ్లాద వరద, శ్రీదేవిభూదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం రెండో రోజు పవిత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహా దేశికన్ స్వామి ఆధ్వర్యంలో లక్ష్మీనరసింహస్వామి, శ్రీదేవి భూదేవి అమ్మవార్లకు ఆలయ ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాలస్వామి పర్యవేక్షణలో పవిత్ర మాలలతో అలం కరించి హోమం పూర్ణాహుతి నిర్వహించారు. ఈఫూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సం ఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు.



పూజలు చేస్తున్న పీఠాధిపతి

రాఘవేంద్రుడి సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి

- ఘనస్వాగతం పలికిన మఠం అధికారులు

మంత్రాలయం, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ సుదా బుధవారం రాత్రి రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం మేనేజర్ ఎస్‌కె శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి మంగళ స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. మఠం పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదమిచ్చి ఆశీర్వదించారు. కార్తీక దీపోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతపురాణిక్, ఎస్‌ఏ శివాంజిల్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, పవన్ ఆచార్, వ్యాసరాజార్, జయతీర్థ ఆచార్, రమణ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు



సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లు

(5వ పేజీ తరువాయి)

ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్ల తీరుపై ఆంధ్రజ్యోతి క్షేత్రస్థాయిలో పరిశీలించింది. రెవెన్యూ, రోడ్ల భవనాలు, పంచాయతీ రాజ్, విద్యుత్, డ్వామా, డీఆర్‌డీఏ-వెలుగు, జలవనరులు.. ఇలా వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారి నుంచి కింద స్థాయి సిబ్బంది, కార్మికుల వరకు తమకు కేటాయించిన పనుల్లో నిమగ్నమై బిజీగా కనిపించారు. ముఖ్యంగా సభా ప్రాంగణం ఏర్పాట్లు ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పర్యవేక్షణలో వేగంగా జరుగుతున్నాయి. విద్యుత్ శాఖ ఇంజనీర్లు, సిబ్బంది స్తంభాలు, విద్యుత్ తీగలు, పాటు ఫ్లడ్‌లైట్లు ఏర్పాట్లు చేస్తున్నారు. 3-4 లక్షలకు పైగా ప్రజలు, పెద్ద సంఖ్యలో ప్రముఖులు హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో సభా ప్రాంగణం అందంగా తీర్చిదిద్దేందుకు వందలాది ఎక్విప్‌మెంట్లు, టిప్పర్లు పని చేస్తున్నాయి. పనుల పర్యవేక్షణకు జిల్లా స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారు.

ఏర్పాట్లపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం చంద్రబాబు సమీక్ష

రాయలసీమ ముఖద్వారం కర్నూలు, దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీశైలంలో ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కర్నూలు, నంద్యాల జిల్లాల కలెక్టర్లు డాక్టర్ ఎ.సిరి, రాజకుమారి, ఎస్పీలు విక్రాంత్ పాటిల్, సునీల్ షెరాన్‌లతో సమీక్ష నిర్వహించారు. ప్రధాని పర్యటనలో తీసుకోవాల్సిన భద్రతా ఏర్పాట్లు, పర్యటన రోడ్ మ్యాప్‌పై చంద్రబాబు సూచనలు చేశారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లు, కార్యక్రమాల నిర్వహణ, సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ నిర్వహణ వంటి వివరాలను ముఖ్యమంత్రికి వివరించారు. ప్రధాని పర్యటనలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎన్డీఏ పార్టీల జాతీయ, రాష్ట్ర ముఖ్య నేతలు హాజరయ్యే అవకాశం ఉంది. ఏ లోటు లేకుండా ప్రధాని పర్యటనను సక్సెస్ చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై సీఎం చంద్రబాబు కలెక్టర్లు, ఎస్పీలకు వివరించారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కర్నూలు కలెక్టర్, అధికారులు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

పక్కా ప్రణాళికతో భద్రతా ఏర్పాట్లు

ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్లపై అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డి జిల్లా పోలీస్ అధికారులతో సమీక్షించారు. ఐజీ శ్రీకాంత్, డీఐజీలు కోయ ప్రవీణ్, సెంథిల్ కుమార్, సత్యయేసు బాబు, పక్కీరప్ప కాగినెల్లిలతో కలసి ఓర్వకల్లు విమానాశ్రయం సమీపంలోని ఏరోవన్ ఫంక్షన్ హాల్‌లో పోలీస్ అధికారులతో ప్రధాని మోదీ పర్యటన భద్రతా ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. భద్రతా, రోడ్డు డైవర్షన్, నిమాపై చర్చించారు. గూగుల్ మ్యాప్ ద్వారా సమీక్షించిన ఆయన డ్రోన్ కెమెరాలతో భద్రతా ఏర్పాట్లు పరిశీలించారు. పోలీస్ అధికారులతో కలిసి హెలిప్యాడ్, సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి ఆపై అధికారులను మాత్రమే భద్రత, బందోబస్తు విధుల్లో నియమించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సూచనలు చేశారు. నిత్యం అధికారులు పర్యవేక్షణ (మానిటరింగ్) చేయాలని సూచనలు చేశారు. కర్నూలు, నంద్యాల సహ అనంతపురం, కడప జిల్లాల నుంచి ఏపీ రూట్లలో వాహనాలు రానున్నాయి. ఆ వాహనాలు ఏ పార్కింగ్‌కు ఎలా మళ్లించాలో క్షేత్రస్థాయిలో అడిషనల్ డీజీ క్షేత్రస్థాయిలో పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్పీలు విక్రాంత్ పాటిల్, పెద్ద నరేశ్, విశ్వనాథ్, దేవరాజ్, ధీరజ్ కునుబిల్లి, దీపికా పాటిల్, అడిషనల్ ఎస్పీలు హుసేన్‌పీరా, కృష్ణమోహన్, ట్రైనీ ఐపీఎస్‌లు, డీఎస్పీలు, ఇంటెలిజెన్స్ స్పెషల్ బ్రాంచ్ అధికారులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు కలెక్టర్లు, ఎస్పీలకు వివరించారు. అంతకు ముందు కర్నూలు కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి రాగమయూరి గ్రీన్ హిల్స్ వద్ద సభా ప్రాంగణం, హెలిప్యాడ్, పార్కింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధాని పర్యటన సక్సెస్ చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై పీఎం ప్రోగ్రామ్స్ స్పెషల్ ఆఫీసర్ వీరపాండియన్, సీఎం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణతో చర్చించారు. వివిధ బాధ్యతలు చూస్తున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆర్ అండ్ బీ ఎస్ఈ మహేశ్వరరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ శాంతికళ, ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, ఏపీ సింధు సుబ్రహ్మణ్యం, డీపీవో భాస్కర్, ఐసీడీఎస్ పీడీ విజయ సహా వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో ఏర్పాట్లను పరిశీలించి పలు సూచనలు చేశారు.



భద్రతా ఏర్పాట్లపై సమీక్షిస్తున్న అడిషనల్ డీజీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోలీసు ఉన్నతాధికారులు



ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి టీజీ భరత్

ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లను పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార శుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్ పరిశీలించారు. సభా ప్రాంగణం ఏర్పాట్లను ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. అలాగే.. హెలిప్యాడ్, పార్కింగ్ స్థలాలను తనిఖీ చేశారు. విద్యుత్, రోడ్ల ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పర్యటనను కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందని అన్నారు. మూడు లక్షల మందికి పైగా హాజరు అవుతారని తెలిపారు. ఏ ఒక్కరికి చిన్న ఇబ్బంది రాకుండా పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని సూచించారు.

ఆటోను ఢీకొట్టిన కారు



బుక్కాపురం సమీపంలో బోల్తాపడ్డ ఆటో

- నలుగురికి తీవ్ర గాయాలు

మహానంది, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆటోను కారు ఢీకొన్న ఘటనలో ఇద్దరు టీచర్లతో మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని బుక్కాపురం సమీపంలో చోటుచేసుకున్నట్లు ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. నంద్యాలకు చెందిన ఉమామహేశ్వరమ్మ, రాఘవేంద్రమ్మ మండలంలోని అబ్బీపురం ప్రభుత్వ పాఠశాలలో టీచర్లుగా పనిచేస్తున్నారు. బుధవారం విధులు ముగించుకొని తిరిగి ఆటోలో నంద్యాలకు వెళ్తుండగా మార్గమధ్యలో బుక్కాపురం సమీపంలో వీరు ప్రయాణిస్తున్న ఆటోను వెనుకవైపు నుంచి కారు ఢీకొంది. ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈఘటనలో ఇద్దరు టీచర్లతో పాటు పుట్టుపల్లికి చెందిన జయరాముడు, ఆటోడ్రైవర్ బాలస్వామి తీవ్రంగా గాయపడ్డారు. నలుగురిని చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు రంగంలోకి దిగి ప్రమాదానికి కారణమైన కారును వెంబడించి పట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మోటారు సైకిల్ ఢీ.. ఉపాధ్యాయినికి తీవ్ర గాయాలు

పాణ్యం: స్థానిక విజయానికేతన్ పాఠశాల వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మోడల్ పాఠశాల ఉపాధ్యాయిని తీవ్రంగా గాయపడినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. మోడల్ పాఠశాలలో సైన్స్ ఉపా ధ్యాయినిగా విధులు నిర్వహిస్తున్న ఇ. సౌజన్య పా ఠశాలకు భర్తతో పాటు వెళ్తూ తమ పిల్లలను విజయానికేతన్ పాఠశాలలో వదలి సుగాలిమెట్టకు మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా మరో మోటారు సైకిల్ అతి వేగంగా వచ్చి ఢీకొంది. సౌజన్య తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. కాగా సౌజన్య మూడు నెలల క్రితం పులివెందుదల నుంచి పాణ్యంకు బదిలీపై వచ్చినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వివరించారు.

విద్యార్థిని బలవన్మరణం

సంజామల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని కానాల గ్రామంలో బుధవారం జరిగింది. గ్రామానికి చెందిన ఏరాశి దస్తగిరి కూతురు ఏరాశి శ్యామల (19) అవుకు పట్టణంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతోంది. బుధవారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందింది. తండ్రి దస్తగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణయ్య తెలిపారు. కాగా ఇదే గ్రామంలో హసేన్‌బీ అనే యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కాగా మృతురాలి వివరాలు తెలియాల్సి ఉంది.

శ్రీశైలంలో కర్ణాటక వ్యక్తి మృతి

శ్రీశైలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలంలో గోశాల వద్ద కర్ణాటకకు చెందిన ప్రకాష్ గురవ్ (70) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులకు స్థానికులు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలికి చేరుకుని చనిపోయిన వ్యక్తి బంధువులకు సమాచారం అందించారు. కాగా ఆయన మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

దొంగ అరెస్టు

కర్నూలు క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని టిడ్కో గృహాల్లో చోరీలకు పాల్పడుతున్న నిందితున్ని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల మేరకు.. కర్నూలు చెందిన షేక్షావలి టిడ్కో ఇళ్లలో రూ.లక్ష విలువ గల అల్యూమినియం డోర్లు చోరీ చేసి విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితునిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

56 ద్విచక్ర వాహనాలు సీజ్

కర్నూలు క్రైం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో 56 ద్విచక్రవాహలను పోలీసులు సీజ్ చేశారు. కొద్ది కాలంగా పలు కేసుల్లో బైకులను గుర్తించి స్టేషన్‌కు తరలించారు. అయితే ఈ వాహనాలను తీసుకెళ్లేందుకు ఎవరూ రాక పోవడంతో కొద్ది కాలంగా పోలీస్ స్టేషన్‌లోనే ఉన్నాయి. ఇటీవల ఎస్పీ అన్ని స్టేషన్లలో ఏళ్లుగా ఉన్న బైకులను డిస్పోస్ చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో నాలుగో పట్టణ పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కొద్దిరోజుల్లోనే వీటిని వేలం వేసేందుకు కేసులు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.


23 నుంచి నవ చండీ హోమం



అమ్మవారిని దర్శించుకుంటున్న నాగేంద్ర స్వామీజీ

కొత్తపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొలనుభారతి పుణ్యక్షేత్రంలో ఈ నెల 23 నుంచి 26వ తేదీ వరకు నవ చండీ హోమం నిర్వహించనున్నట్లు అరుణాచల అన్నపూర్ణ ఆశ్రమం పీఠాధిపతి శివానంద లహరి స్వామీజీ శిష్యుడు నాగేంద్ర స్వామి తెలిపారు. బుధవారం నాగేంద్రస్వామి సరస్వతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పురోహితులు ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని, జ్ఞాపికను అందజేశారు. ఆయన వెంట శిష్య బృందం బోడపాటి ముని చక్రవర్తి, కొమ్ము శివరామకృష్ణ ఉన్నారు.

ఉపాధ్యాయులు మార్గదర్శకులు



అవార్డులు అందజేస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తుకు మార్గదర్శకులని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, ఎంపీ శబరి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆర్కే ఫంక్షన్ హాల్లో ఏపీ ప్రైవేట్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఉత్తమ ప్రైవేట్ ఉపాధ్యాయులను సన్మానించారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. బెస్ట్ టీచర్స్ అవార్డు లోగోను ఆవిష్కరించారు. అసోసియేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, రాష్ట్ర జిల్లా అధ్యక్షులు తులసి విష్ణుప్రసాద్, బిజ్జం సుబ్బారెడ్డి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ పాల్గొన్నారు.

పెద్దమ్మను దర్శించుకున్న టీహెచ్ఆర్సీ సభ్యురాలు

బనగానపల్లె, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని టంగుటూరు పెద్దమ్మను తెలంగాణా మానవహక్కుల కమిషన్ సభ్యురాలు జస్టిస్ ప్రవీణ బుధవారం దర్శించుకున్నారు. ఆమెకు వీఆర్వో శివరామయ్య, ఆలయ కమిటీ సభ్యులు రామగంగిరెడ్డి, కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. ప్రవీణతో పాటు హైకోర్టు మాజీ న్యాయమూర్తి శేషశయనారెడ్డి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వారు పెద్దమ్మతల్లి అన్నదాన సత్రంలో భోజనం చేశారు.

అభివృద్ధికి కృషి

- వర్గాలకు తావులేకుండా ఏకతాటిపై నడిపిస్తా
- వైసీపీ ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదు
- టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి



మాట్లాడుతున్న టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తానని టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. బుధవారం పట్టణంలోని ఇబ్రహీం ఫంక్షన్‌హాలులో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వైకుంఠం శివప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశానికి రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ బీద రవిచంద్రయాదవ్, ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ బుజ్జమ్మ, డీసీఎం ఎస్ చైర్మన్ నాగేశ్వర్‌యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీడీపీలో వర్గాలకు తావు లేకుండా పార్టీని ఏకతాటిపైకి నడిపిస్తామన్నారు. రహదారులు, తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ప్రతిపక్ష హోదా లేని వైసీపీ ఎమ్మెల్యే లు ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఉల్లి రైతులతో చేసిన యాక్షన్ ప్రజలకు తెలుసున్నారు. తనకు టీడీపీ ఇన్‌చార్జిగా నియమించిన సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ బీద రవిచంద్రయాదవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్‌యార్డు చైర్మన్ బిల్లేకల్ వెంకటేష్, ఆలూరు పరిశీలకులు గంజి నాగరాజు, ఆలూరు బ్రాంచ్ కెనాల్ డీసీ అధ్యక్షులు నగరడోణ కిష్టప్ప, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ కురువ జయరాం, మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడు, మండల కన్వీనర్లు అశోక్, వల్లి, విజయ్, పరమరెడ్డి, సుధాకర్, తిప్పయ్య, సీనియర్ నాయకులు వెంకటేష్‌చౌదరి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎల్లార్తి మల్లి, శివప్రకాష్, రఘుబాబు, కటారి కొండ శీనప్ప, కృష్ణయాదవ్, ఉచ్చీరప్ప, బెలగంటి హనుమప్ప, కృష్ణంనాయుడు, వీరసేన రెడ్డి, నరసప్ప, సంజన్న, మేకల రంగనాథ్, సతీష్, బెంగళూరు కిషోర్ పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న నాయకులు

హైకోర్టులో ఎంపీపీ రిట్ పిటిషన్

- అధికారులు సమాధానమివ్వాలని కోర్టు ఆదేశాలు

ఆదోని రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీటీసీలు పెట్టిన అవిశ్వాస తీర్మానం చెల్లదని, ఫోర్జరీ సంతకాలు పెట్టారంటూ ఆదోని ఎంపీపీ దానమ్మ హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. దీంతో జిల్లా నుంచి మండల స్థాయి అధికారులు సమాధా నం చెప్పాలంటూ హైకోర్టు ఆదేశించింది. మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి సన్నిహి తుడిగా ఉన్న మాజీ ఎంపీపీ బడాయి పంపాపతి భార్య బడాయి దానమ్మను ఆదోని ఎంపీపీగా ఎన్నుకున్నారు. ఆమె ప్రస్తుతం వైసీపీని వీడి ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో బీజేపీలో చేరింది. దీంతో ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం పెట్టాలని మాజీ ఎమ్మెల్యే, వైసీపీ ఎంపీటీ సీలు నిర్ణయించు కున్నారు. గత నెల 26వ తేదీన ఫారం-3ని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వారు ఇచ్చారు. ఈనెల 22న అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని నిర్వహించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.



ఎంపీపీ దానమ్మ

అనర్హత వేటు పడినా..

2021 సెప్టెంబరు 24న బడాయి దానమ్మ(వైసీపీ) ఎంపీపీగా ప్రమాణ స్వీకారం చేశారు. నాలుగు నెలలకు ఓసారి జరిగే మండల సర్వసభ్య సమావేశానికి 2/3 ఎంపీటీసీలు హాజరు కావాలి. అలా రాని పక్షంలో సమావేశాన్ని వాయిదా వేయాలి. వరుసగా మూడుసార్లు సమావేశానికి ఎంపీటీసీలు హాజరుకాకపోతే వారిపై అధికా రులు అనర్హత వేటు వేస్తారు. అలా అనర్హత వేటుకు గురైన వారిని సెక్షన్ 21 ప్రకారం పునరుద్ధరించవచ్చు. ఇందులో భాగంగానే 2022-23లో మూడు మండల సమావే శాలకు ఆరుగురు ఎంపీటీసీలు హాజరు కాలేదు. అప్పటి అధికా రులు వారిపై అనర్హత వేటు వేయకుండా సంజాయిషీ కోరుతూ, నోటీసులిచ్చారు. సంబంధిత ఎంపీటీసీలు నోటీసులకు సమాధానం ఇవ్వడంతో తరువాత సమావేశానికి ఆహ్వానించారు. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఎంపీపీ బడాయి దానమ్మ కోర్టుమెట్లెక్కింది.

ఫోర్జరీ సంతకాలు పెట్టారు

తనపై పెట్టిన అవిశ్వాస తీర్మానంలో ఆరుగురు ఎంపీటీసీలు ఫోర్జరీ సంతకాలు పెట్టారని, ఇది చెల్లుబాటు కాదని, తీర్మానాన్ని రద్దు చేయాలని ఎంపీపీ దానమ్మ ఈనెల 6న హైకోర్టులో రిట్ పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌కు సమాధానం చెప్పాలంటూ హైకోర్టు కర్నూలు కలెక్టర్, ఆదోని సబ్‌కలెక్టర్, డీపీవో, డీఎల్‌పీవో, ఎంపీడీవోలను ఆదేశించింది. కోర్టు ఆదేశాలతో మండల కార్యాలయ అధికారులు సమాధానం ఇవ్వడానికి సిద్ధమవుతున్నారు.

కోర్టు నోటీసులు అందాయి

ఎంపీపీ దానమ్మ హైకోర్టులో వేసిన రిట్ పిటిషన్ నోటీసులు కోర్టు ద్వారా బుధవారం తమకు అందాయని ఎంపీడీవో జనార్దన్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోర్టు నోటీసులకు సమాధానమిస్తామన్నారు.

జీతాల కోసం ఎదురుచూపులు

- 200 మందికి నెలకు రూ.24 లక్షలు
- ఆరు నెలలకు రూ.1.44 కోట్లు పెండింగ్
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు



ఆవేదన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

కర్నూలు న్యూసిటీ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని పరిసరాల శుభ్రత గురించి తెల్లవారుజామున నుంచే ఆలోచించే వారు పారిశుధ్య కార్మికులు. మిగతా ప్రజల జీవన విధానం ఎట్లా ఉన్న కార్మికుల జీవన విధానం భిన్నంగా ఉంటుంది. మన ఇంట్లో పొరక పట్టుకుని శుభ్రం చేసేందుకే నామోషి పడే రోజుల్లో కూడా కార్మికులు ఎటువంటి జంకు బొంకు లేకుండా నగరంలోని ప్రతి చోట కాలువలను శుభ్రం చేస్తూ నగరాన్ని సుందరవనంగా తీర్చిదిద్దేందుకు తమవంతు పాత్ర పోషిస్తున్నారు. అయితే ఆరు నెలలుగా వారికి జీతాలు అందడం లేదు. ఒక్కో కార్మికునికి వచ్చేది కేవలం రూ.12 వేలు మాత్రమే. అది కూడ ఇవ్వకపోవడంతో కార్మికులు గత ఆరు నెలలుగా ఇంట్లో పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకొంది.

14 డివిజన్లలో 200 మంది కార్మికులు

నగర పాలక సంస్థ పరిధిలో 14 డివిజన్లలో కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు 200 మంది ఉన్నారు. నగర పాలక పరిధిలోని కాలువల్లో పూడికతీత తీయడం కోసమే వీరిని ఏర్పాటు చేసుకున్నారు. కాలువలను శుభ్రం చేస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికులకు జీతాలు ఇవ్వడం కొరవడింది. ఇంటి అద్దెలు, పిల్లల ఫీజులు, సంసారం ఎలా నెట్టుకురావాలో అర్థం కావడం లేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్కొక్కరికి రూ.10 వేల వేతనంతో పాటు రూ.2 వేలు అలవెన్సు అందాల్సి ఉంది. నెలకు రూ.24.00 లక్షలు, ఆరు నెలలకు రూ.1,44,45,000 చెల్లించాల్సి ఉంది. ప్రారంభంలో ప్రతి నెల తీసుకునేవారని, రాను రాను రెండు నెలలకు ఒక్కసారి వస్తున్నట్లు కార్మికులు చెబుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

కార్మికులకు రావాల్సిన జీతాలకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు పంపించాం. ప్రస్తుతం అకౌంట్స్ విభాగంలో నుంచి ప్రభుత్వానికి వెళ్లినట్లు తెలిసింది. ప్రభుత్వం నుంచి నిధులు ఎప్పుడు మంజూరు అయితే అప్పుడే కార్మికులకు అందజేస్తాం. **- డా.ఎస్‌బీ విష్ణుమూర్తి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్**

జీతాలు సక్రమంగా ఇవ్వాలి

ఆరు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇంటి అద్దెలు...పిల్లలకు పాఠశాల ఫీజులు చెల్లించలేని దిక్కుతోచని స్థితిలో ఉన్నాము. సెలవులు ఇవ్వరు. ప్రతి రోజు పని చేయాల్సిందేనని చెబుతున్నారు. జ్వరం వచ్చి ఒక్కరోజు పనికి రాకుంటే జీతం కట్‌చేస్తున్నారు. అలాంటప్పుడు జీతాలు పెండింగ్ లేకుండా ఇస్తే బాగుంటుంది. **- సరోజ, కార్మికురాలు**



బస్సు డ్రైవర్‌పై ప్రయాణికుడి దాడి

- డ్రైవర్‌కు తీవ్ర గాయాలు
- డిపో వద్ద డ్రైవర్ల నిరసన



ధర్నా చేస్తున్న ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు



బస్సులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ఆళ్లగడ్డ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): అద్దె బస్సు డ్రైవర్‌పై ఓ ప్రయాణికుడు దాడి చేయడంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోలో పని చేస్తున్న ప్రైవేటు బస్సుల డ్రైవర్లు బుధవారం విధులను బహిష్కరించి ధర్నా నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఆళ్లగడ్డ డిపో పరిధిలో నడుస్తున్న ఆర్టీసీ హయ్యర్ బస్సును దువ్వూరు వద్ద ఆపలేదని ఓ ప్రయాణికుడు డ్రైవర్ మహమ్మద్‌పై దాడి చేశాడు. డ్రైవర్ తలకు బలమైన గాయం కావడంతో ప్రైవేటు బస్సుల డ్రైవర్లు బస్సులను డిపో ఆవరణంలో ఉంచి సీఐటీయూ కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ఆళ్లగడ్డ డిపోకు చెందిన బస్సు డ్రైవర్ మహమ్మద్‌పై దాడి చేసిన వ్యక్తిపై నాన్‌బెయిలబుల్ కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దాడికి నిరసనగా నంద్యాల, కోవెలకుంట్ల, ఆత్మకూరు, నందికొట్కూరు, మైదుకూరు, రాజంపేట, జమ్మలమడుగు డిపోలలోని ప్రైవేటు బస్సుల డ్రైవర్లు పాల్గొన్నట్లు సంఘం నాయకులు తెలిపారు. ఒక్కసారిగా ప్రైవేటు బస్సులు నిలిచి పోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

డ్రైవర్‌పై దాడిని ఖండించిన ఆర్ఎం

ఆళ్లగడ్డ- మైదుకూరు హయ్యర్ బస్సు డ్రైవర్ మహమ్మద్ పై జరిగిన దాడిని నంద్యాల రీజనల్ మేనేజర్ రజియా సుల్తానా తీవ్రంగా ఖండించారు. విషయం తెలిసిన వెంటనే బుధవారం ఆమె ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోకు తరలి వచ్చారు. దాడి ఘటనపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసు కున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ సంఘటనతో జిల్లా వ్యాప్తంగా హయ్యర్ బస్సుల డ్రైవర్లు ధర్నాలో పాల్గొన్నారన్నారు. దాడి విషయాన్ని ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ దృష్టికి తీసుకెళ్లామని బాధిత డ్రైవర్‌కు న్యాయం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

గ్రీన్‌కో ప్రాజెక్టుకు 170.14 ఎకరాల అప్పగింత

- ఎకరాకు రూ.6.25లక్షల చొప్పున చెల్లించాలి
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నంద్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పాణ్యం నియోజకవర్గ పరిధిలోని పిన్నాపురంలో గ్రీన్‌కో ప్రాజెక్టుకు 170.14 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల అమరావతిలో సీఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన కేబినేట్ సమావేశంలోనూ ఇదేఅంశంపై ఆమోదం పొందిన విషయం తెలిసిందే. సదరు ప్రాజెక్టుకు కేటాయించిన 170.14ఎకరాల ప్రభుత్వ భూమికి ఒక్కొక్క ఎకరాకు రూ.6.25లక్షల చొప్పున అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో 2020లో జూన్13న ఎకరా రూ.5లక్షల చొప్పున నిర్ణయించగా.. వివిధ కారణాలతో సదరు ఫైల్ అప్పట్లో ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం రాకతో.. కలెక్టర్ రాజకుమారి ఫైల్‌ను మరోమారు పునఃపరిశీలన చేసి ఎకరాకు రూ. 6.25 లక్షల చొప్పున సదరు సంస్థ ప్రభుత్వానికి అందజేయాలని నివేదిక పంపారు. కేబినేట్ సమావేశంలో ఆమోదం పొందాక తాజాగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సదరు భూమిని మొదట నెడ్‌క్యాప్‌కు అప్పగించి.. ఆతర్వాత సంస్థకు అప్పగించి తర్వాత నగదును ప్రభుత్వానికి సదరు సంస్థ చెల్లించనుంది.

10న డిప్లొమా ఇన్ పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

కర్నూలు హాస్పిటల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో డిప్లొమా ఇన్ అలైడ్, హెల్త్ కేర్ సర్వీసెస్ డిప్లమా ఇన్ పారా మెడికల్ కోర్సులకు 2025-26కు గాను అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 10వ తేదీ ఉదయం 10 గంటలకు కాలేజీలోని ఆడిటోరియంలో కౌన్సెలింగ్ ఉంటుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు. ఇంటర్ బైపీసీ విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఇంటర్ ఒరిజినల్ మార్కుల మెమో లేని యెడల వారి దరఖాస్తును తిరస్కరిస్తారని పేర్కొన్నారు.

కల్తీ మద్యంతో చెలగాటం తగదు: వైసీపీ



కర్నూలు ఎక్సైజ్ కార్యాలయం వద్ద బైఠాయించిన వైసీపీ నాయకురాళ్లు

కర్నూలు అర్బన్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి పాలనలో కల్తీ మద్యం అమాయకుల ప్రాణాలను బలి గొంటోందని వైసీపీ మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయమనోహరి ధ్వజమెత్తారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయం ఎదుట వైసీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ వి.హనుమంత రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కల్తీ మద్యంతో పాటు బెల్టుషాపులతో పేదల కుటుంబాలను చంద్రబాబు ప్రభుత్వం చిన్నాభిన్నం చేస్తోందన్నారు.

దారుణాలు

- అడుగడుగునా గుంతలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

పాములపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ రహదారులు గుంతలు గుంతలమయమయ్యాయి. అడుగడుగునా గుంతలు పడడంతో ప్రయాణం నరకాన్ని తలపిస్తోందని ప్రయాణికులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులను బాగుచేయాలని అనేక సార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కోరినా ప్రయోజనం శూన్యమని వాపోతున్నారు. పాములపాడు నుంచి చెలిమిళ్ళ, మిట్టకందాల నుండి మద్దూరు, మద్దూరు నుండి వెలుగోడు, క్రిష్ణరావుపేట నుండి మిట్టకందాల, బుద్దానగర్ వెల్లే గ్రామాలకు వెళ్లే రహదారులు దెబ్బతిన్నాయి. మద్దూరు నుంచి నిత్యం విద్యార్థులు, రైతులు, నిత్యావసర సరుకుల కోసం వెలుగోడుకు గుంతకందాల మీదుగా ప్రయాణం సాగిస్తుంటారు. అయితే రోడ్లు గుంతలమయంగా మారడంతో మద్దూరు నుంచి రేగడగూడూరు మీదుగా వెలుగోడుకు రోడ్డు బాగుండటంతో చుట్టు అయిన ఆరు కిలోమీటర్లు ఎక్కువ ప్రయాణం చేసి చేరుకోవాల్సి వస్తుందని గ్రామస్థులు వాపోతున్నారు. ఈ రోడ్డు బాగు చేయాలని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డికి ఇటీవల మండల టీడీపీ సీనియర్ నాయకులు తిమ్మారెడ్డి వినతి పత్రం అందించారు. ప్రముఖ పుణ్య క్షేత్రమైన కొలనుభారతి, సంగమేశ్వర అలయంనకు నిత్యం భక్తులు వాహనాలలో చెలిమిళ్ళ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. హైవే నిర్మాణం పనుల్లో భారీ వాహనాలు తిరుగుతుండటంతో ఎక్కడ ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణం చేయాల్సి వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


గుంతలమయంగా మారిన మద్దూరు, గుంతకందాల రహదారి


రోడ్డు నిర్మించాలని మంత్రికి వినతిపత్రమిస్తున్న టీడీపీ నాయకుడు తిమ్మారెడ్డి (ఫైల్)

రైతుల సమస్యలు పరిష్కరించాలి


అభివాదం చేస్తున్న ఏపీ రైతు సంఘం మండల నూతన కమిటీ సభ్యులు

నందికొట్కూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం నందికొట్కూరు పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రెండో మహాసభలు బెస్తరాజు అధ్యక్షతన నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించకుండా వ్యాపారస్తులకు, పెట్టుబడుదారులకు ఊడిగం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రైతాంగ హక్కుల కోసం రాజకీయాలకు అతీతంగా ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎస్ ఉస్మాన్ బాషా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొంగర వెంకటేశ్వర్లు, రైతు సంఘం నాయకులు లక్ష్మీశ్వర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు: ఏపీ రైతు సంఘం నందికొట్కూరు మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు తెలిపారు. రైతు సంఘం గౌరవాధ్యక్షులుగా బెస్తరాజు, అధ్యక్షులుగా తారేస్, కార్యదర్శిగా నాగరాజు, సహాయ కార్యదర్శిగా శివకృష్ణ, ఉపాధ్యక్షులుగా శివలింగం, రమణ, సహాయకార్యదర్శిగా స్వాములు, కమిటీ సభ్యులుగా హుస్సేన్ మియా, ధర్మయ్య, శేఖర్, స్వాములు, మా బాషా, శేఖర్, నరసింహను ఎన్నుకున్నారు.

మొక్కజొన్నకు రూ.3,500 మద్దతు ధర కల్పించాలి


మొక్కజొన్న ఉత్పత్తులను పరిశీలిస్తున్న నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంటకు గిట్టుబాటు ధర రూ.3,500 ప్రకటించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. బుధవారం నందికొట్కూరు పట్టణ శివారులో మొక్కజొన్న ఉత్పత్తులను సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ నాయకులు పరిశీలించారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మొక్కజొన్నకు ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర రూ.2400 ఉండగా... బయట మార్కెట్‌లో వ్యాపారస్తులు రూ.2000లకే కొనుగోలు చేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు. తక్కువ దిగుబడులు రావడంతో కనీస మద్దతు ధర రూ.3,500 కల్పించాలని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ లిబరేషన్ మండల కార్యదర్శి స్వామన్న, రైతు నాయకులు గుజ్జుల కృష్ణ, తిక్కస్వామి, రైతులు లక్ష్మన్న, లింగన్న, అన్వర్ బాషా పాల్గొన్నారు.

బంగారు గొలుసు బహూకరణ


బంగారు గొలుసును ఆలయ అధికారులకు అందజేస్తున్న భక్తులు

పాణ్యం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు సుబ్బరాయునికి భక్తులు బుధవారం 42 గ్రాముల బంగారు గొలుసును బహూకరించారు. ఆలయ ఈవో రామకృష్ణ మాట్లాడుతూ తిరుపతి పట్టణంకు చెందిన కర్నాటి సుబ్బప్రశాంత్, ధర్మపత్ని, కార్నాటి స్వాతి కుటుంబ సభ్యులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి భక్తుల ఇంటి ఇలవేల్పు కావడంతో మొక్కుబడిగా 42 గ్రాముల బంగారు గొలుసును విరాళంగా అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, నాగేశ్వరరావు, అర్చకులు సురేష్ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

రేపు మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలు

పాణ్యం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలస్థాయి క్రీడా ఎంపిక పోటీలు పాణ్యం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు హెచ్ఎం రామునాయక్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి గాను 10న మండల స్థాయి క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాండ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

స్మార్ట్ కార్డుల పంపిణీ


స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నందికొట్కూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తున్నట్లు పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జీ లాయర్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. పట్టణంలోని 28వ వార్డులో స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ నాయకులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పట్టణ క్లస్టర్ ఇన్‌చార్జీ లాయర్ జాకీర్ హుస్సేన్, యూనిట్ ఇంచార్జీ వేణుగోపాల్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఎల్లయ్య ఆచారి పాల్గొన్నారు.

పారదర్శకంగా భూ రీసర్వే

నంద్యాల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : పారదర్శకంగా భూ రీసర్వే నిర్వహిస్తున్నట్లు నంద్యాల తహసీల్దారు శ్రీవాణి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. గ్రామ సభలు ఏర్పాటు చేసి రైతులకు భూ రీసర్వేపై అవగాహన కల్పించామన్నారు. రైతుల సమక్షం లో పొలం సరిహద్దురాళ్లను, డాక్యుమెంట్లను పరిశీలించి న్యాయబద్ధంగా భూ రీసర్వే చేపడుతున్నామన్నారు. గ్రామంలో 2,440.55 ఎకరాలు సాగు భూమి ఉండగా అందులో 145.45 ఎకరాలు ప్రభుత్వ భూమి ఉన్నట్లు తెలిపారు.

సర్పంచ్‌పై ఎంపీడీవోకు ఫిర్యాదు

పాములపాడు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇస్కాల గ్రామంలో సర్పంచ్ స్థానిక పంచాయతీ సిబ్బందిని అడ్డు పెట్టుకొని ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాడని, ఎంపీడీవో చంద్రశేఖర్‌కు స్థానిక టీడీపీ నాయకులు నాగలక్ష్మిరెడ్డి, లింగస్వామి ఫిర్యాదు చేశారు. గ్రామాభివృద్ధికి కూటమి ప్రభుత్వం విడుదల చేసిన పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నాడన్నారు. సర్పంచ్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

ఆర్ఎస్ఎస్‌కు వందేళ్లు

మహానంది,అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ వందేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తున్నామని రాష్ట్ర కార్య కార్యకారిణి యుగంధర్ అన్నారు. బుధవారం మహానంది ఆలయ పరిసరాల్లో మహానంది ఖండ ఆధ్వర్యంలో విజయదశిమి ఉత్సవం వేడుకను ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కేశవరావు, బలిరామ్‌హెడ్గే వార్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను 1925లో విజయదశిమి పర్వదినం రోజు స్థాపించారని అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఆర్ఎస్ఎస్ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి సంఘ సేవకులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

గడివేముల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మూలపెద్దమ్మ ఆలయ హుండీని పర్యవేక్షణాధికారి హరిశ్చంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. చెల్లించిన ముడుపులను లెక్కించగా రూ.8,10,575 వచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి రామలింగారెడ్డి, ఆలయ చైర్మన్ రమణారెడ్డి, నరేంద్రారెడ్డి, ఆలయ సిబ్బంది రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలకు స్వచ్ఛమైన నీటిని అందేలా చర్యలు తీసుకోవాలి

- ఎస్ఎస్ ట్యాంక్‌ను పరిశీలించిన ఎంపీ బైరెడ్డి శబరి

పగిడ్యాల, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజ్ (ఎస్ఎస్) ట్యాంకు నుంచి సమీప గ్రామాలకు స్వచ్ఛమైన నీటిని అందేలా చర్యలు తీసుకోవాలని నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఇక్బాల్‌కు సూచించారు. మండలంలోని లక్ష్మాపురం సమీపంలో ఏర్పాటు చేసిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లోని నీటి నిల్వలు, ఫిల్టర్ బెడ్‌లను తనిఖీ చేశారు. నీటిని శుద్ధి చేసే బెడ్‌లలోని నీరు పాచిపట్టి ఉండడం, శుభ్రం చేయకపోవడంతో సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై మండిపడ్డారు. రెండు రోజులలోపు బెడ్లలోని నీటిని తొలగించి స్వచ్ఛమైన నీటిని అందజేయాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంపీ వెంట గ్రామ సర్పంచ్ సుజాత, ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేంద్ర కుమార్ ఉన్నారు.


లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్వాహణపై అధికారులతో మాట్లాడుతున్న ఎంపీ బైరెడ్డి శబరి

జీఎస్టీ 2.0పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ఆత్మకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కొత్తగా అందుబాటులోకి తీసుకొచ్చిన జీఎస్టీ 2.0పై అవగాహన కల్పించేందుకు గాను బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించినట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతిబాయి తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని నూతన జీఎస్టీ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినట్లు తెలిపారు. తద్వారా అనేక వస్తువుల ధరలు తగ్గి ప్రజలకు వెసులుబాటు కలగనుందని వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కృష్ణ, ఎన్‌సీసీ కోఆర్డినేటర్ విద్యాసాగర్, అధ్యాపకులు నాగన్న, తిరుపతమ్మ, తదితరులు ఉన్నారు.

జీఎస్టీ తగ్గింపు ప్రయోజనకరం : దేశవ్యాప్తంగా జీఎస్టీ సుంకాలను తగ్గించడం వల్ల ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక కళాశాలలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు అబ్దుల్ జబ్బార్, శివయ్య, నరేష్, తాయన్న, జావీద్, సలీమ్, సుజాత ఉన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుంకన్న

సూపర్ జీఎస్టీతో పేదలకు భరోసా

ఎన్డీఏ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన సూపర్ జీఎస్టీ వల్ల పేద, మధ్యతరగతి ప్రజలకు భరోసాగా నిలుస్తుందని సింగిల్ విండో చైర్మన్ షాబుద్దిన్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ పేరిట ఆత్మకూరు పట్టణంలోని 6వ వార్డుల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం నిర్ధేశించిన జీఎస్టీ మార్పులతో ఎంతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు జరగనుందని అన్నారు. ధరల నియంత్రణతో ప్రజలకు ఆర్థిక భారం తగ్గనుందని వివరించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వనరుల పెంపుతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి

పాణ్యం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): వనరుల పెంపుతోనే గ్రామ పంచాయతీల అభివృద్ధి సాధ్యమని పాణ్యం ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సొంత మూల ఆదాయం ఎలా పెంచుకోవాలో అనే అంశంపై పంచాయతీ, సచివాలయ సిబ్బందికి రెండు రోజులుగా శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం నిధుల పెంపుకు అవసరమైన నిధులు ఎక్కడ ఎలా సమీకరించాలో వివరించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వరలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ రమణయ్య పాల్గొన్నారు.

పాములపాడు: పాములపాడు ఎంపీడీవో కార్యలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఆదాయ వనరులపై రెండురోజుల శిక్షణ కార్యక్రమం బుధవారంతో ముగిసింది. కార్యక్రమంలో ఇంజనీరంగు, డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జూపాడుబంగ్లా: పంచాయతీ ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రణాళిక తయారు చేసుకోవాలని ఎంపీడీవో కార్యాలయం పరిపాలనా అధికారి మధుసూదనయ్య అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో రెండోరోజు సర్పంచులు, ఇంజినీరింగ్ అసిస్టంట్లు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. పంచాయతీ ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

టీడీపీ పాలనలోనే రాష్ట్రాభివృద్ధి


గాజులపల్లి ఆర్ఎస్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న రామలింగారెడ్డి

మహానంది, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని కెసీ కెనాల్ అధ్యక్షుడు బన్నూరి రామలింగారెడ్డి అన్నారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లి ఆర్ఎస్ పంచాయతీ పరిధిలో సూపర్ సేవింగ్- సూపర్ జీఎస్టీపై మండల టీడీపీ అధ్యక్షుడు కంచెర్ల శివశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. రామలింగారెడ్డి గ్రామంలోని ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అస్లాంభాషా, ఎంపీపీ యశస్వీని, టీడీపీ నాయకులు శ్రీనివాసులు, రమణలు పాల్గొన్నారు.

కొత్తపల్లికి 11.96 మెట్రిక్ టన్నుల యూరియా

కొత్తపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలోని మనగ్రోమోర్ సెంటర్‌కు మంగళవారం 11.96 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని మండల వ్యవసాయాధికారిణి అమీరున్నిసా భేగం తెలిపారు. బుధవారం ఏవో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతుల ఆదార్, పొలం పాస్‌బుక్‌తో పాటు రైతులతో ఈపాస్ మిషన్ల నందు వేలిముద్రలు వేయించుకుని రైతులకు యూరియా పంపిణీ చేసినట్లు ఏవో వెల్లడించారు. మండల టీమ్ పర్యవేక్షణలో యూరియా అవసరమైన రైతులందరికి పంపిణీ చేశామని ఏవో తెలిపారు.

ఆత్మకూరు: ఆత్మకూరు సింగిల్ విండో సొసైటీ పరిధిలోని రైతులకు పుష్కలంగా ఎరువులను పంపిణీ చేసేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు సొసైటీ చైర్మన్ షహబుద్దిన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం రైతులకు యూరియా బస్తాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాను సొసైటీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 100 టన్నుల వరకు ఎరువులను పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సొసైటీ మేనేజర్ నాగేశ్వరరావు, డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, టీడీపీ నాయకులు అన్సర్, శ్రీను, చంద్ర, భూపాల్‌రెడ్డి, మహెబూబ్ ఉన్నారు.

గో సంరక్షణ పథకానికి రూ. లక్ష విరాళం


చెక్కు అందజేస్తున్న దాతలు

శ్రీశైలం, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ పథకానికి కర్ణాటక రాష్ట్రం సింధునూరుకు చెందిన భక్తులు బుధవారం రూ.1,00,011/-ల విరాళాన్ని పర్యవేక్షకుడు కె. శివప్రసాద్‌కు అందజేశారు. దాతలకు దేవస్థానం తరుపున రశీదు, ప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు.

దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నందికొట్కూరు, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లాలో ఆళ్లగడ్డ డిపోకు చెందిన హయర్ బస్సు డ్రైవర్ మహ్మద్ రఫీపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం కడప జిల్లాలో ఆర్టీసీ డ్రైవర్‌పై జరిగిన దాడికి నిరసనగా నందికొట్కూరు డిపోలోని హయర్ బస్సుల డ్రైవర్లు బంద్ పాటించి ఆందోళన కార్యక్రమాన్ని చేపట్టారు. నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నాయకులు గోపాలకృష్ణ మాట్లాడుతూ బస్సును ఆపి డ్రైవర్‌పై దాడి చేయడం హేయమైన చర్య వారు అన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం డిపో ఎస్టీఐ డిఎం షఫీకి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పక్కీర్ సాహెబ్, హయర్ బస్సు వర్కర్స్ యూనియన్ నాయకులు సుబ్బయ్య, రవి, నాగేషు, రాజు, శేషు గౌడ్, నాగార్జున గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు


నంద్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆర్టీసీ కార్మికులు

ఆత్మకూరు: ఆళ్లగడ్డ ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు డ్రైవర్‌ను కడప జిల్లాలోని దువ్వూరులో ప్రయాణికులు చేసిన దాడికి నిరసనగా బుధవారం ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలోని అద్దె బస్సులను నిలిపివేసి అద్దె బస్సుల డ్రైవర్లు నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఏసురత్నం, పట్టణ కార్యదర్శి రామ్‌నాయక్ మాట్లాడుతూ.. అద్దె బస్సుల డ్రైవర్లపై దాడులు, వేధింపులు జరగడం దారుణమన్నారు. అద్దె బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అద్దె బస్సుల డ్రైవర్స్ యూనియన్ నాయకులు షాకీర్, మౌలాలి, జనార్ధన్, వెంకటేశ్వర్లు ఉన్నారు.

నంద్యాల రూరల్: కడప జిల్లా దువ్వూరులో ఆర్టీసీ ఆళ్లగడ్డ డిపోకు చెందిన ఎయిర్ బస్సు డ్రైవర్ మహ్మద్‌పై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం దాడిని నిరసిస్తూ నంద్యాల డిపోలో బస్సులను నిలిపి వేసి సమ్మె చేపట్టారు. అనంతరం ఆర్టీసీ రీజనల్ మేనేజర్ రజియా సుల్తానా సీఐటీయూ నాయకులు, కార్మికులతో చర్చించారు. దాడులు జరగకుండా ప్రజలకు అవగాహన కల్పించేలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని, దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, మహ్మద్‌గౌస్, వెంకట లింగం, రాజశేఖర్ పాల్గొన్నారు.

శ్మశాన వాటికలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతాం


మొక్క నాటుతున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : శ్మశాన వాటికలను ఆహ్లాదకరంగా, పరిశుభ్రంగా తీర్చిదిద్దుదామని రాష్ట్ర న్యాయ,మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. బుధవారం పట్టణ సమీపంలోని భీమవరం రస్తాలోని స్వర్గధామంలో నవ నిర్మాణ సమితి ఆధ్వర్యంలో వెయ్యి పూల మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన పూల మొక్కలతో శ్మశాన వాటికలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడానికి ముందుకొచ్చిన నవ నిర్మాణ సమితిని అభినందించారు. గతేడాదిలో 4 వేల పూల మొక్కలు నాటి బృందావనంగా తీర్చిదిద్దామన్నారు. స్వర్గధామాన్ని తిలకించడానికి రాయలసీమ నుంచే తెలంగాణ నుంచి కూడా వస్తున్నట్లు పేర్కొన్నారు. వైకుంఠ రథం ఏర్పాటు చేయాలని మంత్రిని సభ్యులు కోరారు. అనంతరం మంత్రి చేతుల మీదుగా స్వచ్ఛాంధ్ర ప్రదేశ్ అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామచంద్రరావు, నెరవాటి సత్యనారాయణ, కౌన్సిలర్ నాగార్జున, పబ్బతి వేణు తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణపై అవగాహన ఉండాలి


విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న సబ్ డీఎఫ్‌వో బబితా కుమారి

మహానంది, అక్టోబరు 8 (ఆంధ్ర జ్యోతి): గిరిజన విద్యార్థులు విద్యతో పాటు అడవుల సంరక్షణపై అవగాహన కలిగి ఉండాలని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ హైమవతి అన్నారు వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా బుధవారం మహానందిలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమపాఠశాలలో అటవీ సిబ్బంది కార్యక్రమం నిర్వహించారు. మహానంది పురవీధుల్లో ర్యాలీ నిర్వ హించారు. అనంతరం అడవులతో పాటు వన్యప్రాణుల మనుగడపై డీఆర్వో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సత్యాలు, ఎఫ్ఎస్ఓ రామకృష్ణ, ఎఫ్‌బీఓలు శ్రీనివాసులు,ప్రతాప్, పరమేశ్వరీలు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: అడవులు, వణ్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ పరిరక్షణతోనే మానవుని మనుగడ సాధ్యపడుతుందని శ్రీశైలం సబ్ డీఎఫ్‌వో బబితా కుమారి పేర్కొన్నారు. బుధవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో అక్టోబర్ 2 నుండి 8వ తేది వరకు నిర్వహించిన వణ్యప్రాణి వారోత్సవాల ముగింపు వేడుకలను మండలంలోని బైర్లూటి ఎకో టూరిజం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు,బైర్లూటి, నాగలూటి, శ్రీశైలం అటవీ రేంజ్‌లలోని ఆయా పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, డ్రాయింగ్ తదితర పోటీలు నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు, బైర్లూటి,వెలుగోడు రేంజర్లు ప్రణతిబాయి,కృష్ణప్రసాద్, తాహెర్, ఎఫ్ఎస్‌వోలు, ఎఫ్‌బీవోలు,ఏబీవోలు,చెంచులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నంద్యాల రూరల్, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేరియర్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ సునీత ఆధ్వర్యంలో నంద్యాల మండల పరిధిలోని కొత్తపల్లి జడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈశ్వర వర ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

జూపాడుబంగ్లా, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఇళ్లకు వెళ్లే సమయంలో రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎస్ఐ మల్లికార్జున అన్నారు. మండల కేంద్రం జూపాడుబంగ్లాలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. 18ఏళ్లే నిండినవారే వాహనాలు నడపాలని, లైసన్సులు తప్పకుండా పొందాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల బస్సు సమస్యను పరిష్కరించాలి

కొత్తపల్లి, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం నుంచి ఆత్మకూరుకు విద్యను అభ్యసించడానికి వస్తున్న పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థుల బస్సు సమస్యలను పరిష్కరించాలి ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దినేష్ ఆర్టీసీ అధికారులను కోరారు. బుధవారం ఆయన ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులతో కలిసి ఆత్మకూరు ఆర్టీసీ డిపో మేనేజర్ వినయ్ కుమార్‌కు విద్యార్థుల బస్సు సమస్యలపై వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తేజ, లక్ష్మణ్, జగదీష్, సంజీవ, నితిన్, వేణు, శ్రావణ్ పాల్గొన్నారు.

10న ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

ఆత్మకూరు, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ ఆఫ్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీన స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎంపిక పోటీలను నిర్వహిస్తున్నట్లు మండల కోఆర్డినేటర్ మురళీనాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు దేవానంద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ.. కబడ్డి, ఖోఖో, వాలీబాల్, షటిల్, బాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ క్రీడలకు సంబంధించి అండర్-14, 17 విభాగాల్లో బాల బాలికలకు ఈ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

కొత్త మండలం ఏర్పాటుపై అధ్యయనం

ప్యాపిలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్యాపిలిలో జలదుర్గం కేంద్రంగా కొత్త మండలం ఏర్పాటుకు అధికారులు అధ్యయనం ప్రారంభించారు. బుధవారం మండలంలోని జలదుర్గం గ్రామాన్ని డోన్ ఆర్డీవో నరసింహులు సందర్శించారు. కొత్త మండలం చేయడానికి అర్హతలు ఉన్నాయని ఆయన ఆరాతీశారు. కొత్త మండలం అయితే అందుకు తగ్గట్టు ప్రభుత్వ భూములు, జనాభా, కొత్త మండలం పరిధిలోకి వచ్చే గ్రామాల సంఖ్యపై ఆయన అధ్యయనం చేశారు. జలదుర్గం కొత్త మండలానికి అవసరమైన సౌకర్యాలపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ఆయన వెంట తహసీల్దారు భారతి, ఆర్ఐ సుజాత, వీఆర్వో సునీల్, పోలీసులు ఉన్నారు.

రేపు యాగంటిలో హుండీ ఆదాయం లెక్కింపు

బనగానపల్లె, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని యాగంటి క్షేత్రంలో శుక్రవారం దేవదాయ అధికారుల సమక్షంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్నట్లు ఈవో పాండురంగారెడ్డి తెలిపారు.

రేపు తలనీలాల వేలం: యాగంటి దేవస్థానంలో తలనీలాలు పోగు చేసుకునే హక్కు కోసం శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో తెలిపారు. ఆసక్తిగల వేలం పాట దారులు రూ.50 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

ఎంపీని కలిసిన బీజేపీ నాయకులు

డోన్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం ప్రారంభోత్సవానికి విచ్చేసిన నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆర్డీవో నరసింహులు, సీఐ ఇంతియాజ్ బాషా, బీజేపీ నాయకులు కొత్తకాపు హేమసుందర్ రెడ్డి, ఆర్మీ రామయ్య, మద్దిలేటి పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలి

ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

బేతంచెర్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామని వర్తింపజేసేలా టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం బేతంచెర్ల పట్టణంలోని టీడీపీ కార్యాలయ ప్రాంగణంలో కూటమి నాయకులు, కార్యకర్తలు బూత్ క్లస్టర్ యూనిట్ ఇన్‌చార్జిలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ నెల 16న ఉమ్మడి జిల్లాలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయాలని కార్యకర్తలు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, టీడీపీ సీనియర్ నాయకురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు రాఘవరెడ్డి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు గుండా అశ్వర్థ నారాయణ, జిల్లా కార్యదర్శి నాగ మోహన్, జనసేన మండల కార్యదర్శి శ్రీకంటి మధు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

డోన్ టౌన్: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు సీఎం సహాయ నిధి చెక్కు ఎంతో అండగా ఉంటుందని ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే కోట్ల నివాసంలో సీఎం సహాయ నిధి కింద విడుదలైన రూ.4 లక్షల చెక్కును లబ్ధిదారునికి ఎమ్మెల్యే కోట్ల అందజేశారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి

ప్రతి రైతు శాస్త్రవేత్త కావాలి

జిల్లా ఉద్యానశాఖ శాస్త్రవేత్త దీప్తి

చాగలమర్రి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతి రైతు శాస్త్రవేత్త కావాలని జిల్లా ఉద్యానశాఖ శాస్త్రవేత్త దీప్తి అన్నారు. బుధవారం మండలంలోని చిన్నవంగలి గ్రామంలో అరటిసాగుపై రైతులకు మెలకువలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల్లో అరటిలో తీగతోక మచ్చ తెగుళ్ల ఉధృతి ఉందని అన్నారు. ఈ తెగుళ్లకు సకాలంలో గుర్తించి తగిన సస్యరక్షణ చర్యలను చేపట్టడం ద్వార నివారించచ్చని అన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఉద్యానశాఖ అధికారి దస్తగిరి, ఏవో రంగనేతాజీ, వీహెచ్ఏ ఫరూక్, రైతులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకంతో..

రుద్రవరం: తేనెటీగలను పెంపకంతో లాభాలు సాధించొచ్చని జిల్లా ఉద్యాన శాఖ శాస్త్రవేత్త దీప్తి అన్నారు. మండలంలోని ఆలమూరులో రైతు సేవా కేంద్రంలో రైతులకు శిక్షణ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ తేనెటీగల, మష్రూమ్ పెంపకం చేయడం ఎలా అనేదానిపై శిక్షణ ఇచ్చారు. ఏవో సుమతి, హెచ్‌వో దస్తగిరి, ఏఈవో రాజు పాల్గొన్నారు.



చిన్నవంగలిలో అరటి తోటను పరిశీలిస్తున్న దీప్తి

దిగువ అహోబిలంలో కేశఖండన శాల ప్రారంభం

ఆళ్లగడ్డ, అక్టోబరు 8 (ఆంధ్రజ్యోతి): అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నిర్మించిన కొత్త కేశఖండన శాలను మఠం 46వ పీఠాధిపతి రంగనాథ యతీంద్ర మహాదేశికన్ స్వామి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకేసారి వంద మంది భక్తులు కేశ ఖండన చేయించుకునే విధంగా ఈ కేశఖండన శాలలో సదుపాయాలు కల్పించామన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాల్ స్వామి, ఈఓ సుందరరాజన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



నూతన కేశఖండన శాలను ప్రారంభిస్తున్న పీఠాధిపతి

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

ప్యాపిలి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దని ఉప మండలాధ్యక్షురాలు రాజా రూపరాణి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అంటు రోగాలు ప్రబలే అవకాశాలు ఉన్నాయన్నారు. ఆరోగ్య కార్యకర్తలు గ్రామాల్లో పర్యటించి రోగాల బారిన పడ కుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయం, విద్యా, ఐసీడీఎస్, వెలుగు తదితర శాఖల అధికారులు తమ పరిధి లోని సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దారు భారతి, ఏఈలు, ఏపీవోలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు

డోన్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలిగా డోన్ చెందిన లక్ష్మేశ్వరి ఎంపికైంది. బుధవారం డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మను ఆమె మర్యాదపూర్వకంగా కలిశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొలిమిగుండ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): కుటుంబ వివాదాల నేపథ్యంలో ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డ తుమ్మలపెంటకు చెందిన మహిళ స్వాతి (27) కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బేతంచెర్లలో భారీ వర్షం

బేతంచెర్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): బేతంచెర్లలో బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి పట్టణంలోని డ్రైనేజీ కాలువల నీరు రోడ్లపై భారీగా పారుతుండ టంతో పాదాచారులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కురిసిన వర్షానికి ముద్దవరం గ్రామంలో పంటలు నీటిలో మునిగాయి.

మల్లెల రాజశేఖర్‌ను కలిసిన మల్లికార్జున

డోన్ టౌన్, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బెస్త అభివృద్ధి, సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రజావైద్యశాల మల్లికార్జున నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్‌ను ఆయన స్వగృహంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మల్లెల రాజశేఖర్‌ను పూలమాలలతో సన్మానించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : తహసీల్దార్

ఉయ్యాలవాడ, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని తహసీల్దారు ప్రసాదుబాబు హెచ్చరించారు. బుధవారం రెవెన్యూ కార్యాలయంలో ఆయా గ్రామాల వీఆర్వోలతో ఆయన సమావేశమయ్యారు. ఆర్ఐ అంకన్న పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

బనగానపల్లె, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ పర్యటనను విజయంతం చేయాలని జిల్లా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి కిరణ్ పిలుపునిచ్చారు. బుధవారం బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రపభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. బీజేపీ నాయకులు శివకృష్ణ యాదవ్, చాందినీ, బచ్చు శర్‌చంద్రకుమార్, యాదగిరి పాల్గొన్నారు.

నిందితులను త్వరలో పట్టుకుంటాం: సీఐ

కొలిమిగుండ్ల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనంత పురం గ్రామంలో జరిగిన చోరీ ఘటన నిందితులను త్వరలో పట్టుకుం టామని సీఐ మద్దినేని రమేష్‌బాబు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రం నుంచి క్లూస్ టీం సభ్యులను రప్పించి, మదనంతపురంలోని అంబటి జనార్దనరెడ్డి ఇంటితోపాటు, చుట్టు పక్కల ప్రాంతాలను పరిశీలించారు. ఘటనా స్థలంలో వేలి ముద్రలను క్లూస్ టీం సేకరించినట్లు సీఐ రమేష్‌బాబు వెల్లడించారు.

వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత

చాగలమర్రి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): వన్యప్రాణుల సంరక్షణ మనందరి బాధ్యతని అటవీశాఖ రుద్రవరం రేంజర్ ముర్తుజావలి అన్నారు. బుధవారం చాగలమర్రి బాలికోన్నత పాఠశాలలో హెచ్ఎం శివలక్ష్మి ఆధ్వర్యంలో వన్యప్రాణుల సంరక్షణా చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వీధుల్లో ర్యాలీ చేశారు. డిప్యూటీ రేంజర్ ఎన్.శ్రీనివాసులు, ఎఫ్ఎస్‌వో రాణెమ్మ, ఎఫ్ ఎస్‌వో మహబూబ్‌ఖాన్, ఎఫ్‌వో రామకృష్ణ, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

చాగలమర్రి, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): చాగలమర్రి గ్రామంలోని మల్లేం వీధిలో టీడీపీ రాష్ట్ర మైనార్టీసెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. టీడీపీ కోశాధికారి మురళీకృష్ణ, పట్టణ ఉపాధ్యక్షుడు కె.రమేష్, టీడీపీ నాయకులు జల్సా గౌస్, అనిఫ్, శ్రీహరి, ఎం.దయానంద, మహిళలు పాల్గొన్నారు

డోన్ రూరల్: పేదలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వెంకటనాయునిపల్లె గ్రామ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు అన్నారు. బుధవారం మండలంలోని వెంకటనాయునిపల్లెలో రేషన్ కార్డుదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన పంపిణీ చేశారు.

రెడ్ క్రాస్ సభ్యుడిగా నరసింహమూర్తి

సంజామల, అక్టోబరు 8(ఆంధ్రజ్యోతి): రెడ్ క్రాస్ సభ్యుడిగా పేరుసోముల ఆర్ఎంపీ వైద్యుడు వీవీ నరసింహమూర్తి ఎన్నికయ్యారు. నంద్యాల కలెక్టరేట్‌లో జరిగిన రెడ్‌క్రాస్ సొసైటీ ఎన్నికల్లో నరసింహమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.